క్లుప్తంగా

రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత

కృష్ణా జిల్లా ఎస్పీ జాషువా

కోనేరు సెంటర్(మచిలీపట్నం): రహదారి భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని కృష్ణా జిల్లా ఎస్పీ పి. జాషువా అన్నారు. కృష్ణాజిల్లా రవాణాశాఖ ఆధ్వర్యంలో 34వ రహదారి భద్రత వారోత్సవాల ముగింపు కార్యక్రమం మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలోని స్పందన హాలులో నిర్వహించారు. స్వచ్ఛత, భద్రత అనే నినాదంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. వారోత్సవాలను పురస్కరించుకుని డివిజన్ పరిధిలోని విద్యార్థులకు నిర్వహించిన క్విజ్, వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విజేతలకు ఎస్పీ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. అలాగే ఏపీఎస్ ఆర్టీసీలో గత 31 ఏళ్లుగా రహదారి ప్రమాదాలు జరగకుండా ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానాలకు చేర్చిన పలువురు డ్రైవర్‌లకు ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎస్పీ మాట్లాడుతూ రహదారి ప్రమాదం అంటే వ్యక్తి రోడ్డుపై పడటం కాదన్నారు. బాధితుడితో పాటు అతని కుటుంబం రోడ్డున పడటమేనని గ్రహించాలన్నారు. ముఖ్యంగా మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై పోలీసుశాఖ కఠినమైన చర్యలు తీసుకుంటుందన్నారు.

మనకెందుకులే అనుకోవద్దు..

జిల్లా రవాణశాఖ అధికారి సీతాపతి మాట్లాడుతూ రహదారి ప్రమాదాలు జరిగినపుడు మనకెందుకులే అనుకోకుండా బాధితుడి ప్రాణాలు కాపాడటం సామాజిక బాధ్యతగా భావించాలన్నారు. ప్రమాదాలకు గురైన వారిని గోల్డ్ అవర్ సమయంలో ఆసుపత్రికి చేర్చి కాపాడినట్లయితే కేంద్ర ప్రభుత్వం కాపాడిన వ్యక్తికి ప్రోత్సాహకంగా నగదు బహుమతిని అందజేస్తామన్నారు. జిల్లా అడిషనల్ ఎస్పీ ఎన్. వెంకటరామాంజనేయులు, ఎంవీఐలు సిద్దిక్, నాయక్, నారాయణస్వామి, ఏఎంవీఐలు సోనిప్రియా, ఆయిషా, సత్యనారాయణ పాల్గొన్నారు.

పిల్లల ఎదుగుదలకు పోషకాహారం అవసరం

గన్నవరం: పిల్లల ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు మంచి పోషక విలువలు కలిగిన ఆహారం అందించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సిహెచ్. నాగపద్మావతి సూచించారు. మండలంలోని కేసరపల్లి, గన్నవరం సెక్టారులోని గ్రామాల్లో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు ఇంటింటికి వెళ్లి పిల్లలు ఎత్తుకు తగ్గ బరువు గుర్తించే కార్యక్రమం చేపట్టారు. పిల్లల పోషక స్థితిని వారి తల్లిదండ్రులకు వివరించారు. ఈ సందర్భంగా నాగపద్మావతి మాట్లాడుతూ...పిల్లలు వయసుకు తగ్గ బరువు, ఎత్తు ఉండడం వల్ల ఆరోగ్యం ఉంటారని చెప్పారు. దీనికోసం ప్రతిరోజు పాలు, గుడ్లుతో పాటు పౌష్టికాహారాన్ని అందించాలని తెలిపారు. ఆయా గ్రామాల అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల హక్కుల సంరక్షణ అందరి బాధ్యత

ఘనంగా అంతర్జాతీయ బాలికాదినోత్సవం

పెనమలూరు: అంతర్జాతీయ బాలికా దినోత్సవం మూడు నియోజకవర్గాల పరిధిలో ఘనంగా నిర్వహించారు. బాలికల హక్కులపై అవగాహన కార్యక్రమాలు జరిగాయి. కానూరు–పెనమలూరులో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో ఎన్ఎస్ఎస్ విద్యార్థినులు కాలేజీ నుంచి వందడుగుల రోడ్డు వరకు బేటీ బచావో–బేటీ పడావో నినాదాలతో ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు మాట్లాడుతూ బాలికల పట్ల అసమానతలు తొలగాలంటే బాలికల హక్కులు పరిరక్షించాలన్నారు. బాలికలకు చదువు, ఉద్యోగాలు, ఆర్థికంగా అభివృద్ధి సాధించితేనే గుర్తింపు ఉంటుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బాలికల సంరక్షణకు తీసుకుంటున్న చర్యలకు అందరు మద్దతు పలకాలన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర, విద్యార్థినులు పాల్గొన్నారు.

జెడ్పీ హైస్కూలులో..

పెనమలూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జాతీయ బాలికల దినోత్సవం ఘనంగా చేశారు. ఎంఈవో కనకమహాలక్ష్మి మాట్లాడుతూ బాలికలను సంరక్షించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. బాలికలు అక్షరాస్యత సాధిస్తేనే అభివృద్ధి సాధించగలుగుతారని వివరించారు. హెచ్ఎం ఎలమంచిలి దుర్గాభవాని, విద్యార్థినులు పాల్గొన్నారు.

గన్నవరం రూరల్: మండలంలోని ముస్తాబాద, సూరంపల్లి, మాదలవారిగూడెం, సావరగూడెం, పురుషోత్తపట్నం, కొండపావులూరు, గోపవరపుగూడెం గ్రామాల్లో మంగళవారం చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాలికా దినోత్సవం జరిగింది. సమాన హక్కులతోనే బాలికాభ్యున్నతి సాధ్యమన్నారు. కో–ఆర్డినేటర్ సీహెచ్ ప్రభాకర్, మహిళా పోలీసులు, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

గన్నవరం: మండలంలోని కేసరపల్లి శివారు సుందరయ్యనగర్‌లోని ఎంపీపీ పాఠశాలలో వాసవ్య మహిళా మండలి, హెచ్‌సీఎల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో జాతీయ బాలికల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బాలికల భద్రత, పోషక ఆహార ఆవశ్యకత, బాలికల విద్యకు ప్రభుత్వం అందిస్తున్న సహకారాన్ని మహిళా మిత్ర సభ్యురాలు సదాలక్ష్మి వివరించారు. విద్యార్థినులు వేషధారణలతో ఆకట్టుకున్నారు. హెచ్ఎం శ్రీరాములు, హెచ్‌సీఎల్ ఫౌండేషన్ కేసరపల్లి ఇన్‌ఛార్జ్ టి.కేశవ, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు. దావాజిగూడెం ఎంపీపీ స్కూల్ విద్యార్థులతో బాలికల దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. హెచ్ఎం దాసరి నవభారతి, ఉపాధ్యాయురాలు సుభాషిణి, సచివాలయ మహిళా పోలీస్ అనిత, వాసవ్య మహిళా మండలి కౌన్సిలర్ విజయ తదితరులు పాల్గొన్నారు.

ఉంగుటూరు: బాల్య వివాహాలు నిషేధించి, ఆడపిల్లలను చదివించాలని ఎంపీడీవో జీఎస్వీ శేషగిరి రావు పేర్కొన్నారు. మండలంలో పలు గ్రామాల్లో జాతీయ బాలిక దినోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. హైస్కూల్ విద్యార్థులు ప్లకార్డులు చేత పట్టుకుని నినాదాలు చేస్తూ ప్రధాన రహదారుల్లో ర్యాలీ నిర్వహించారు. సెక్టార్ సూపర్‌వైజర్ పద్మావతి, హెచ్ఎం ప్రభాకర్‌రావు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



కానూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు



పెనమలూరు జిల్లా పరిషత్ పాఠశాలలో



గోపవరపుగూడెంలో పోస్టర్లను ప్రదర్శిస్తున్న బాలికలు, హెచ్ఎం తేజోమయి



దావాజిగూడెం ర్యాలీలో ఉపాధ్యాయులు, మహిళలు



ఉంగుటూరు ర్యాలీలో విద్యార్థులు, అధికారులు

రేషన్ పంపిణీ భేషుగ్గా ఉంది

కేంద్ర ప్రభుత్వ ఆహార, ప్రజా పంపిణీ శాఖ డైరెక్టర్ కేఎంఎస్ ఖల్సా ప్రశంస

కంకిపాడు/ఉయ్యూరు: రాష్ట్రంలో రేషన్ పంపిణీ వ్యవస్థ భేషుగ్గా ఉందని కేంద్ర ప్రభుత్వ ఆహార, ప్రజా పంపిణీ శాఖ డైరెక్టర్ కేఎంఎస్ ఖల్సా అన్నారు. కంకిపాడు పట్టణంలోని నాలుగో నంబర్ రేషన్‌షాపు, ఉయ్యూరులోని 16, 18 రేషన్ షాపులను మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఉయ్యూరు ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి దుకాణాలకు సరఫరా అయ్యే రేషన్ సరుకుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. రేషన్ డీలర్ల నియామకం, పనిచేసే విధానం, స్టాక్ బోర్డు ప్రదర్శన, రిజిస్టర్‌ల నిర్వహణ అంశాలను తనిఖీ చేశారు. బియ్యం, కందిపప్పు, పంచదార శ్యాంపిళ్లను సేకరించి వాటి నాణ్యతను పరిశీలించారు. ఇంటి వద్దకు రేషన్ అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన రేషన్ పంపిణీ విధానాన్ని, పంపిణీ చేసే వాహనాల్లో సమకూర్చిన సదుపాయాలు, సిబ్బంది పనితీరును స్వయంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజాపంపిణీ వ్యవస్థ అమలు సంతృప్తికరంగా ఉందని అభిప్రాయం వ్యక్తం చేశారు. రేషన్ సరుకులతో పాటుగా రాగులు, జొన్నలు, గోధుమ పిండి, నూనెలు ఇవ్వాలని కార్డుదారులు కోరుతున్నారని, ఈ విషయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నివేదిస్తామని పేర్కొన్నారు. పర్యటనలో జిల్లా పౌరసరఫరాల అధికారి పార్వతి పాల్గొన్నారు.



ఉయ్యూరులో రేషన్ పంపిణీ వాహనం వద్ద వివరాలు సేకరిస్తున్న కె.ఎం.ఎస్.ఖల్సా

యువతలో నైపుణ్యాభివృద్ధే లక్ష్యం

ఉంగుటూరు: నైపుణ్యాలు కలిగిన యువతే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఉన్నత విద్య కోసం ఏడాదికి రూ.5వేల కోట్లు ఖర్చు పెడుతోందని ఏపీ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ చైర్మన్ ప్రొఫెసర్ కె.హేమ చంద్రారెడ్డి అన్నారు. ఉంగుటూరు మండలం తేలప్రోలులో ఉషారామా ఇంజినీరింగ్ కళాశాలలో రెండు రోజులు జరిగే యువర్ ఫెస్ట్–2023 కార్యక్రమం మంగళవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హేమచంద్రారెడ్డి పాల్గొని ప్రసంగించారు. ప్రస్తుత ప్రభుత్వం యువతను నైపుణ్యవంతులుగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక నిధులు కేటాయిస్తోందని అన్నారు. ప్రభుత్వ తోడ్పాటును యువత సద్వినియోగించుకుని తమ వంతుగా సమాజాభివృద్ధికి కృషి చేయాలని ఆకాంక్షించారు. ఏపీ హయ్యర్ ఎడ్యూకేషన్, ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యూకేషన్, నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్‌లు లక్షా అరవై వేలకు పైగా ప్రొఫెషనల్, సర్టిఫికేషన్ కోర్సులను ఆఫర్ చేస్తున్నాయని తెలిపారు. క్యాప్ జెమిని సీనియర్ డైరెక్టర్ మహంతేష్, కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం, కరస్పాండెంట్ సుంకర అనీల్ పాల్గొనారు.



హేమ చంద్రారెడ్డి

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

గన్నవరం రూరల్: దేశ భవిష్యత్ విద్యార్థులపై ఆధారపడి ఉందని విజయవాడ నవజీవన్ బాలభవన్ జోనల్ కో–ఆర్డినేటర్లు జె.ఆంజనేయులు, బి.శ్రీవల్లి పేర్కొన్నారు. మంగళవారం వీరపనేనిగూడెం జెడ్పీ హైస్కూల్‌లో మత్తు పదార్థాల దుర్వినియోగంపై విద్యార్థులకు స్క్రీన్ ప్రొజెక్టర్‌పై అవగాహన నిర్వహించారు. తాత్కాలిక సంతోషాల కోసం బంగారం లాంటి జీవితాలను పాడుచేసుకోవద్దని చెప్పారు. అనేక వ్యాధులకు మత్తు పదార్థాలు కారణమవుతాయని హెచ్చరించారు. హెచ్ఎం ఎ.వెంకటేశ్వరరావు, మహిళా పోలీస్ ఎండి బబిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చోరీ ఘటనపై కేసు నమోదు

కంకిపాడు: చోరీ ఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..కంకిపాడు పట్టణానికి చెందిన కొండూరు దుండి సాయిచంద్ బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజినీరుగా పనిచేస్తున్నాడు. పట్టణంలోని పోస్టాఫీసు రోడ్డులోని ఇంటిలో నివాసం ఉంటున్నాడు. ఈనెల 16న కుటుంబ సమేతంగా విధుల నిమిత్తం బెంగుళూరుకు వెళ్లాడు. 23వ తేదీ రాత్రి సాయిచంద్ ఇంట్లో లైట్లు వెలగటాన్ని గుర్తించిన స్థానికులు వారికి ఫోన్ చేయటంతో వారు ఇంట్లో లేరని తేలింది. మంగళవారం ఉదయం సాయిచంద్ కుటుంబం ఇంటికి వచ్చి చూసే సరికి తలుపు తాళాలు పగలకొట్టి ఉండటాన్ని గమనించి చోరీకి పాల్పడ్డారని నిర్ధారించుకున్నారు. ఇంటిలో బీరువా పగలకొట్టి వస్తువులు చిందరవందరగా పడవేసి ఉన్నాయి. బీరువాలో 10 గ్రాముల బరువైన మూడు ఉంగరాలు కనిపించలేదు. ఈ మేరకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కంకిపాడు సీఐ పరమేశ్వర్, అదనపు ఎస్ఐ లక్ష్మి ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. చోరీ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

93 మంది విద్యార్థినులకు వైద్య పరీక్షలు



మందులు అందజేస్తున్న వైద్యాధికారి సునీత

రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం గూడవల్లిలోని ప్రభుత్వ ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో జాతీయ బాలబాలికల దినోత్సవం సందర్భంగా మంగళవారం ఎంపీయూపీ పాఠశాలలో ఆరోగ్య సూత్రాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా 93 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వైద్యాధికారి డాక్టర్ కె.సునీత మాట్లాడుతూ విద్యార్థులు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. కాచి వడపోసిన నీరు తాగాలని, ఆహార పదార్థాలను వండిన వెంటనే తినాలని, పాత్రలపై మూతలు ఉంచాలని సూచించారు. నిత్యం యోగాసనాలు వేయాలన్నారు. వైద్య సిబ్బంది కోటేశ్వరరావు, పాఠశాల హెచ్ఎం జె.రవి కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రం వద్ద అభ్యర్థుల ఆందోళన



ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

పెనమలూరు: సాంకేతిక సమస్య కారణంగా పరీక్ష నిర్వహణ నిలిచిపోవడంతో అభ్యర్థులు ఆందోళనకు దిగారు. కానూరు పరిధిలో ఉన్న శైలేష్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఐయాన్ పరీక్ష కేంద్రంలో మంగళవారం ఆన్‌లైన్లో నిర్వహించాల్సిన సెంట్రల్ టీచర్స్ ఎలిజిబులిటీ టెస్టు కోసం దాదాపు 700 మంది హాజరయ్యారు. సాంకేతిక పరమైన లోపాల కారణంగా పరీక్ష నిర్వహణలో సమస్య తలెత్తింది. దీనిపై నిర్వాహకులు ఎవరూ సరైన సమాధానం చెప్పక పోవటంతో అభ్యర్థులు ఆందోళనకు దిగారు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనాస్థలం వద్దకు వచ్చి బందోబస్తు ఏర్పాటు చేశారు. పరీక్ష నిర్వాహకులు, ఆందోళన చేస్తున్న వారితో చర్చల అనంతరం పరీక్ష మరో తేదీన నిర్వహిస్తామని సీటెస్టు డైరెక్టర్ ప్రకటించటంతో ఆందోళన విరమించారు.

నేటి నుంచి 'సాక్షి ప్రీమియర్ లీగ్'

విజయవాడ స్పోర్ట్స్: 'సాక్షి ప్రీమియర్ లీగ్'(ఎస్పీఎల్) నాల్గో సీజన్ క్రికెట్ లీగ్ పోటీలు ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభిస్తున్నట్లు 'సాక్షి' విజయవాడ బ్రాంచి మేనేజర్ యశోదరాజు తెలిపారు. ఏపీఎండీసీ, ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌ల సౌజన్యంతో సాక్షి మీడియా ఈ పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోందని చెప్పారు. దీనిలో భాగంగా కానూరులోని వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో జరిగే ఉమ్మడి కృష్ణా జిల్లా స్థాయి జూనియర్ బాలుర, సీనియర్ పురుషుల పోటీలను బుధవారం ఉదయం 8 గంటలకు రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీ రావు ప్రారంభిస్తారని తెలిపారు. పది రోజుల పాటు నిర్విరామంగా జరిగే ఈ పోటీల్లో 12 జూనియర్ జట్లు, 27 సీనియర్ జట్లు నాకవుట్ పద్ధతిలో తలపడతాయన్నారు. ఆయా విభాగాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన జట్లను ఉమ్మడి కృష్ణాజిల్లా జట్లుగా ఎంపిక చేస్తామన్నారు. ఎంపికైన జిల్లా జట్లు త్వరలో జరిగే రీజనల్ స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తాయన్నారు.

నేడు జరిగే మ్యాచ్‌లు..

- ఎస్ఆర్ జూనియర్ కాలేజీ టీం–1 vs మిక్ డిప్లొమా కాలేజీ
- ఎస్ఆర్ఐ జూనియర్ టీం–2 బెంజిసర్కిల్ vs శాతవాహన జూనియర్ కాలేజీ
- ఆంధ్రా లయోల జూనియర్ కాలేజీ vs ప్రభుత్వ ఐటీఐ కాలేజీ

చేపలు పడుతూ వ్యక్తి ఆకస్మిక మృతి



పెనమలూరు: కృష్ణానదిలో చేపలుపడుతునన ఓ వ్యక్తి ఆకస్మాత్తుగా మృతి చెందటంతో పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ ఆర్.గోవిందరాజు తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ పటమటలంకకు చెందిన మైలా వెంకటేశ్వరరావు (55) పెదపులిపాక గ్రామ పరిధి కృష్ణానదిలో సోమవారం సాయంత్రం చేపలు పట్టడానికి నదిలోకి వెళ్లాడు. అయితే అతను చేపలు పడుతూ హఠాత్తుగా పడవలో పడి ప్రాణాలు వదిలాడు. పడవలో పడిపోవటం వలన ఛాతికి దెబ్బతగిలి మృతి చెందాడా లేక ఏదన్న అనారోగ్య కారణాలతో మరణించాడా తెలియలేదు. ఈ ఘటన పై మృతుడి కుమారుడు నాగబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టంకు తరలించారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం



గన్నవరం: స్థానిక పాత స్టేట్ బ్యాంక్ బిల్డింగ్ సమీపంలో జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటనపై మంగళవారం గన్నవరం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం ప్రకారం.. సోమవారం రాత్రి జాతీయ రహదారి దాటుతున్న వ్యక్తిని ఏలూరు నుంచి విజయవాడ వైపు వెళ్తున్న నాగాలాండ్‌కు చెందిన ట్రాలీ లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో సదరు వ్యక్తి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై ఎస్ఐ శ్రీనివాస్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ప్రమాదం తర్వాత ట్రాలీ డ్రైవర్ పరార్ అవ్వడంతో వాహనాన్ని స్టేషన్‌కు తరలించారు. అయితే మృతునికి సంబంధించి ఎటువంటి ఆచూకీ లభ్యం కాలేదని ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



పెనమలూరు: యనమలకుదురు గ్రామ పరిధి బందరు కాలువలో గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు లాకుల వద్ద మంగళవారం గుర్తు తెలియని మృతదేహం కాలువలో కొట్టుకు వచ్చింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వటంతో మృతదేహాన్ని పోలీసులు కాలువ నుంచి బయటకు తీసి స్వాధీనం చేసుకున్నారు. మృతుడి వయస్సు 35–40 మధ్య ఉంటుందని, మృతదేహంపై లేతగులాబీ రంగు ఫుల్‌హ్యాండ్ షర్టు, నలుపు రంగు ప్యాంటు ఉందన్నారు. మృతదేహాన్ని గుర్తించిన వారు వెంటనే పెనమలూరు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

కల్యాణ మండపం లీజు హక్కుల వేలం

పెనమలూరు: యనమలకుదురు గ్రామంలో శ్రీ సంతాన వేణుగోపాలస్వామివారి దేవస్థానానికి చెందిన కల్యాణ మండపం లీజుల హక్కుల బహిరంగ వేలం నిర్వహిస్తున్నామని ఆలయ కార్యనిర్వహణాధికారి గంగాధరరావు తెలిపారు. ఆయన మంగళవారం మాట్లాడుతూ స్వామివారికి చెందిన ధనేకుల సుబ్బయ్య, వెంకమ్మ కల్యాణ మండపానికి ఈ నెల 27వ తేదీన ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని తెలిపారు. లీజు పొందినవారు 2023-2025 సంవత్సరాలకు హక్కులు కలిగి ఉంటారు. లీజు వేలం దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో నిర్వహిస్తారు. ఆసక్తి కలిగిన వారు నిబంధనలకు లోబడి వేలంలో పాల్గొనవచ్చని తెలిపారు.

ఎయిర్‌పోర్ట్ ప్రైవేటీకరణ తగదు

గన్నవరం: విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయంను ప్రైవేటీకరణ చేయాలనే బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వ నిర్ణయం విరమించుకోవాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదల వెంకటేశ్వరరావు మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. దేశ వ్యాప్తంగా ఉన్న 137 మేజర్ విమానాశ్రయాల్లో 25 ఎయిర్‌పోర్ట్‌లను ప్రైవేటీకరించాలని 2021-22 బడ్జెట్ పార్లమెంట్ బడ్జెట్ సమావేశాల్లో కేంద్రం ప్రకటించిందన్నారు. వీటిలో రాష్ట్రంలోని విజయవాడ, తిరుపతి విమానాశ్రయాలు ఉన్నాయని తెలిపారు. ఇప్పటికే విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం విస్తరణ కోసం రైతుల నుంచి 700 ఎకరాలు సేకరించి సుమారు రూ.1,050 కోట్లు ఖర్చు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికైన కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ ఆలోచనను విరమించుకోవాలని వారు ఈ సందర్భంగా డిమాండ్ చేశారు.

ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ పొడిగింపు హర్షణీయం



మాట్లాడుతున్న రాజు

కంకిపాడు: ఎస్సీ, ఎస్టీల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని సబ్‌ప్లాన్‌ను మరో పదేళ్లు పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవటం హర్షణీయమని పీవీ రావు మాలమహానాడు ఉమ్మడి కృష్ణాజిల్లా అధ్యక్షుడు గోగులమూడి రాజు అన్నారు. పట్టణంలోని సంఘ కార్యాలయంలో ముఖ్య బాధ్యుల సమావేశం మంగళవారం నిర్వహించారు. రాజు మాట్లాడుతూ సబ్‌ప్లాన్ పొడిగింపుపై జీఓ నంబరు 7ను ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. సబ్‌ప్లాన్ నిధులు నేరుగా దళితులు, గిరిజనుల సంక్షేమానికి వినియోగించేలా ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని విజ్ఞప్తిచేశారు. సమావేశంలో గన్నవరం నియోజకవర్గ అధ్యక్షుడు సరిహద్దు ఆంథోని తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్యసేవలు అందించాలి



సమీక్ష చేస్తున్న హెల్త్ సూపర్‌వైజర్ సారమ్మ

కంకిపాడు: ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఉప్పలూరు పీహెచ్‌సీ హెల్త్ సూపర్‌వైజర్ సారమ్మ సూచించారు. స్థానిక ఆరోగ్య కేంద్రంలో సెక్టార్ సమావేశం వైద్య ఆరోగ్య సిబ్బందితో మంగళవారం నిర్వహించారు. మండల పరిధిలోని గ్రామాల్లో ఏఎన్‌ఎంలు నిర్వహించిన విధులు, అందించిన సేవలపై సమీక్షించి నివేదిక రూపొందించారు. ప్రజలకు ఆరోగ్యం పట్ల అవగాహన పెంచాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామారావు, ఏఎన్‌ఎంలు వై.పద్మావతి, జి.తిరుపతమ్మ, పి.శైలజ, ఎం.లక్ష్మి, ఐ.భవాని, పి.పద్మావతి, ఏ.సుగుణ పాల్గొన్నారు.

ఓటర్ల దినోత్సవం విజయవంతం చేయాలి

కంకిపాడు: ఓటర్ల దినోత్సవాన్ని విజయవంతం చేయాలని పెనమలూరు నియోజకవర్గ సహాయ ఎన్నికల రిటర్నింగ్ అధికారి టీవీ సతీష్ కోరారు. మంగళవారం ఆయన కంకిపాడులో మాట్లాడారు. ఈనెల 25న 13వ జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించాలన్నారు. నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో 274631 మంది ఓటర్లు ఉన్నారన్నారు. ఓటర్ల దినోత్సవ వేడుకలను ఆయా మండలాల్లో ఘనంగా నిర్వహించాలన్నారు. 18-19 ఏళ్ల వయస్సు ఓటర్లు 1604 మంది, 20-29 ఏళ్ల వయస్సు ఓటర్లు 43188 మంది, 30-39 ఏళ్ల వయస్కులు 71,046 మంది యువ ఓటర్లు నియోజకవర్గంలో ఉన్నారన్నారు. శతాధిక ఓటర్లు 43 మంది ఉన్నారన్నారు. ఓటు హక్కు వినియోగించుకోవాల్సిన ఆవశ్యకతపై ఓటర్ల దినోత్సవంలో అవగాహన కల్పించాలన్నారు.

వృద్ధుడి సెల్‌ఫోన్ చోరీ

హనుమాన్‌జంక్షన్ రూరల్: సినీఫక్కీలో వృద్ధుడి నుంచి సెల్‌ఫోన్ చోరీ చేసిన సంఘటన హనుమాన్‌జంక్షన్‌లో మంగళవారం చోటు చేసుకుంది. విజయవాడరోడ్డులోని పోలీస్‌స్టేషన్‌కు సమీపంలోని షాపులో సరుకులు కొనుగోలు చేసేందుకు వృద్ధుడు వెళ్లాడు. బైక్‌పై వచ్చిన ఇద్దరు యువకులు తొలుత దుకాణంలోకి వెళ్లుతున్న వృద్ధుడి ఎదుట రూ.20 నోటు కిందపడవేసి మీ డబ్బులు పడిపోయాయని చెప్పి నమ్మించారు. ఆ నోటుకు తీసుకునేందుకు వంగిన సమయంలో వృద్ధుడి సెల్‌ఫోన్ కాజేసేందుకు యత్నించి విఫలమయ్యారు. ఆ తర్వాత వృద్ధుడు షాపు నుంచి బయటకు వచ్చి ఆటో ఎక్కుతున్న తరుణంలో మారుమారో రూ.20 నోటు కింద వేసి డబ్బులు పడిపోయాయని చెప్పటంతో డబ్బు తీసుకునేందుకు వృద్ధుడి ప్రయత్నిస్తున్న సమయంలో సెల్‌ఫోన్ లాక్కుని బైక్‌పై వేగంగా వెళ్లపోయారు. ఈ ఘటనతో అవాక్కైన వృద్ధుడి కేకలు వేసినప్పటికీ దుండగులు చేతికి చిక్కలేదు.

రోడ్డు భద్రతపై వ్యాస రచన పోటీలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా స్థానిక నూజివీడురోడ్డులోని బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాస రచన, చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు. రోడ్డు భద్రతా నియమాలు, నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణపై విద్యార్థుల వ్యాస రచనలు ఆలోచింపజేశాయి. హనుమాన్‌జంక్షన్ ఎస్‌ఐ వాసా వెంకటేశ్వరరావు, ట్రాఫిక్ ఎస్‌ఐ సుందరరావు చేతుల మీదుగా పోటీలలో విజేతలకు బహుమతులు అందించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తోట వెంకట నాగేశ్వరరావు, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.